## క్లుప్తంగా

### అల్ఫోర్స్‌లో వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

భైంసాటౌన్: పట్టణంలోని అల్ఫోర్స్‌లో బుధవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనికి విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి హాజరై విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### బీరువా అందజేత

మామడ: మండలంలోని పొన్కల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు 1994–95 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు రూ.10వేల విలువైన బీరువాను బుధవారం అందించారు. పాఠశాలలో విద్యార్థుల సామగ్రి, ఇతర రికార్డులు భద్రపరిచేందుకు ప్రధానోపాధ్యాయుడు మైస అరవింద్‌కుమార్‌కు అందించినట్లు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. సుధాకర్‌రెడ్డి, చిన్నాగౌడ్, రవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

### ఆవాసానికి విరాళం

భైంసాటౌన్: పట్టణంలోని స్వామి వివేకానంద అనాథ పిల్లల ఆవాసానికి కుంటాల మండల కేంద్రానికి చెందిన తాటి పద్మావతి–సోమేశ్వర్ దంపతులు రూ.5,100 విరాళం అందజేశారు. వారి వివాహ వార్షికోత్సవం పురస్కరించుకుని భైంసాలోని ఆవాసంలో పలువురు విద్యార్థులతో కలిసి వేడుకలు జరుపుకొన్నారు. అనంతరం వారితో భోజనం చేసి పండ్లు పంపిణీ చేశారు.

### డిపోలో మహిళా దినోత్సవం

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళా ఉద్యోగులు ఆటపాటలతో గడిపారు. బస్టాండ్‌లో మహిళా ప్రయాణికులకు గులాబీ పూలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. డీఎం, అసిస్టెంట్ మేనేజర్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

### రైతునేస్తం ప్రారంభం

లోకేశ్వరం/కుంటాల : రైతులకు వ్యవసాయ విస్తరణ సేవలు, సాంకేతిక జ్ఞానం అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం రైతునేస్తం ప్రారంభించారు. సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపిక చేసిన రైతువేదికల్లోని రైతులతో మాట్లాడారు. లోకేశ్వరంలో పాల్గొన్న వారిలో మండల వ్యవసాయాధికారి గణేశ్, జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ తదితరులు ఉన్నారు. కుంటాలలో ఎంపీపీ ఆప్కగజ్జారాం యాదవ్,ప్రోగ్రాం అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ హన్మాండ్లు, ఏవోలు సోమలింగారెడ్డి, రాంచందర్ నాయక్, ఇకార్ అహ్మద్, లక్ష్మణ్, ఎంపీటీసీలు, ఏఈవోలు పాల్గొన్నారు.

### సమయపాలన పాటించాలి

ఖానాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది సమయపాలన పాటించాలని మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. బుధవారం పట్టణంలోని ఐదోవార్డు పరిధిలో ఇంద్రానగర్ అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందించకుంటే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అంతకుముందు అంబేడ్కర్ సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో చైర్మన్, వైస్ చైర్మన్ సంతోష్‌ను సన్మానించారు. పరిమి సురేశ్, షబ్బీర్‌పాషా, మేస సతీశ్, ద్యావతి రాజేశ్వర్, రాజ్‌కుమార్, సురేశ్, దామోదర్ తదితరులు ఉన్నారు.

### రజకుల సంక్షేమానికి కృషి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

ఖానాపూర్: రజకుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో సంఘం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా నాయకులు ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవించారు. ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ సత్యం, వైస్ చైర్మన్ సంతోష్‌ను సన్మానించారు. అనంతరం పట్టణంలోని బస్టాండ్ సమీపంలో సింధు మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని ఎమ్మెల్యే ప్రారంభించారు. సట్ల శంకర్, సట్ల నర్సయ్య, నర్సయ్య, అమానుల్లాఖాన్, పరిమి సురేశ్, జన్నారపు శంకర్, నిమ్మల రమేశ్, దయానంద్, షబ్బీర్ పాషా, శివ తదితరులు ఉన్నారు.

### ముగిసిన మహిళా శిబిర్

తానూరు: మండలంలోని కల్యాణి గ్రామంలో భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో వారం రోజులుగా కొనసాగుతున్న మహిళా శిబిర్ బుధవారం ముగిసింది. ఈసందర్భంగా భారతీయ బౌద్ధ మహాసభ కేంద్రీయ శిక్షక్ సరోదే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బుద్ధుడి వ ర్గంలో నడవాలని సూచించారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు రమేశ్‌బాబు వాగ్మారే, మండలాధ్యక్షుడు సూర్యకాంత్‌పవార్, సంజయ్, విలాస్, సతీశ్ పాల్గొన్నారు.

# మల్చింగ్ సాగుతో లాభాలు

- తక్కువ పెట్టుబడులతో అధిక ఆదాయం
- 50శాతం పెరిగిన దిగుబడులు
- కర్బూజ సాగులో ఆదర్శంగా పీచర గ్రామ రైతులు



కోతకు వచ్చిన పంట



పీచరలో సాగవుతున్న కర్బూజ పంట

| ఎకరానికయ్యే ఖర్చు.. | |
|---|---|
| విత్తనాలకు | రూ.15,300 |
| మల్చింగ్‌షీట్ | రూ.12వేలు |
| ఎరువులు | రూ.6వేలు |
| స్ప్రే మందులు | రూ.6వేలు |
| మొత్తం | రూ.39,300 |

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామ రైతులు పాత సంప్రదాయాలను పక్కనబెట్టి మల్చింగ్ విధానంలో కర్బూజ సాగు చేస్తూ అధిక లాభాలు పొందుతున్నారు. నీటిని వృథా చేయకుండా మొక్కలకు డ్రిప్ పద్ధతిన అందిస్తున్నారు. దీంతో కలుపు కూడా తక్కువ ఉంటుంది. ఈ పద్ధతిన పంటలు సాగు చేస్తే తక్కువ పెట్టుబడులతో ఎక్కువ ఆదాయం పొందవచ్చని రైతులు పేర్కొంటున్నారు.

**మల్చింగ్ పద్ధతితో ఉపయోగాలు..**

మొక్కల చుట్టూ నేల(వేర్ల భాగం)ను ఏదైనా పదార్థంతో కప్పి ఉంచడాన్ని మల్చింగ్ అంటారు. ఈ పద్ధతిని రెండు రకాలుగా ఉపయోగించుకోవచ్చు. మొదటి పద్ధతిలో ఎండుగడ్డి, ఎండిన ఆకులు, వరిపొట్టు, రంపం పొట్టు మొక్క చుట్టూ రెండు నుంచి ఐదు అంగుళాల మందంలో వేయాలి. ఇవి పంటకు మల్చింగ్‌తో పాటు సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతాయి. ఈ విధానంలో మొక్కలకు డ్రిప్ పద్ధతిన నీటిని అందిస్తే తక్కువ అవసరం అవుతుంది. సూర్యరశ్మి నేరుగా మొక్కలపై పడకపోవడంతో కలుపును కూడా నివారించవచ్చు. దీంతో మొక్కలకు అనుకూల వాతావరణం ఏర్పడి దిగుబడులు పెరుగుతాయి. మొక్క మొక్కకు, వరుసకు గల దూరాన్ని బట్టి షీట్‌పై రంధ్రం చేయాలి. ప్రస్తుతం రంధ్రాలు చేసిన షీట్లు కూడా మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి.

**30 ఎకరాల్లో సాగు..**

మండలంలోని పీచర గ్రామంలో పులువురు యువ రైతులు సుమారు 30 ఎకరాల్లో కర్బూజ పంటను మల్చింగ్ పద్ధతిలో సాగు చేస్తూ మంచి లాభాలు గడిస్తున్నారు. ఎకరంలో కర్బూజ పంట సాగుకు రూ.40 వేల వరకు ఖర్చయితే దిగుబడి 15 నుంచి 20 టన్నుల వరకు వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. టన్ను కర్బూజ ధర రూ.15వేలు ఉండగా.. ఎకరాకు రూ.2.25 లక్షలు చేతికివస్తాయని అంటున్నారు. పెట్టుబడులు పోనూ తమకు మంచి ఆదాయమే గిట్టుబాటు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

**ఎకరాకు 9వేల విత్తనాలు..**

మల్చింగ్ విధానంలో సాగు చేసే కర్బూజ పంటకు ఎకరాకు తొమ్మిది వేల విత్తనాలు అవసరం అవుతాయి. ఒక ప్యాకెట్‌లో 1000 విత్తనాలు ఉంటాయి. ఒక్కో ప్యాకెట్ ధర రూ.1700 వరకు ఉండగా.. ఎకరాకు విత్తనాలకే రూ.15,300 అవుతాయని రైతులు పేర్కొంటున్నారు.

### 80 రోజుల పంట



వానాకాలంలో మొక్కజొన్న పంట అనంతరం యాసంగిలో రెండో పంటగా కర్బూజ సాగు చేస్తున్నా. 80 రోజుల పంట ఇది. తక్కువ పెట్టుబడి, శ్రమతో మంచి లాభాలు వస్తున్నాయి. వ్యవసాయాధికారులు అవగాహన కల్పిస్తే మరిన్ని దిగుబడులు సాధిస్తాం. – నైనం ముత్యం, పీచర

### మంచి లాభం వచ్చింది



రెండెకరాల్లో కర్బూజ పంట సాగు చేశా. మొదటి ఎకరంలో 15 టన్నుల దిగుబడి వచ్చింది. కిలోకు రూ.18 చొప్పున టన్నుకు రూ.18వేలకు విక్రయించా. దీంతో రూ.2.70 లక్షల ఆదాయం సమకూరింది. పెట్టుబడి పోనూ ఎకరంలో రూ.రెండు లక్షల ఆదాయం వచ్చింది. – తిప్పని శేఖర్, పీచర

# విద్యారంగాన్ని మరింత బలోపేతం చేస్తాం

- బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి

మామడ: విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసి.. పేదవిద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామని నిర్మల్ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొరిటికల్ జెడ్పీ సెకండరీ పాఠశాలలో పీఎంశ్రీ పథకం కింద మంజూరైన రూ.13.50లక్షలతో అదనపు తరగతి గది నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. డీఈవో రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ సుశీల్‌రెడ్డి, ఎంఈఓ ముత్యం, బాపురెడ్డి, రాజారెడ్డి, చక్రపాణి, చిన్నారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి ఉన్నారు.

**లక్ష్మణచాందలో..**

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.13.50 లక్షలతో నిర్మించే సైన్స్ ల్యాబ్ భవనానికి ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి భూమి పూజ చేశారు. పాఠశాలలో రూ.80 లక్షలతో నిర్మించే తరగతి గదులను 15 రోజుల్లో పూర్తి చేయించడంతోపాటు నిర్మించిన మరుగుదొడ్లను వినియోగంలోకి తే వా లని అధికారులకు సూచించారు. పాఠశాలకు అనుబంధంగా ఉన్న బీసీ బాలుర వసతి గృహానికి రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు హరిప్రసాద్ ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన మహేశ్వర్‌రెడ్డి అందుకు చర్యలు చేపట్టాలని డీఈవో రవీందర్‌రెడ్డికి సూచించారు. ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేపట్టి విద్యార్థులకు తాగునీటిని అందజేయాలన్నారు. డీఈవో రవీందర్‌రెడ్డి, ఎంపీపీ పద్మ, జెడ్పీటీసీ రాజేశ్వర్, డీఈఈ గంగాధర్, తహసీల్దార్ జానకి, ఎంపీఓ నసీరుద్దీన్, ఏఈ అంజనేశ్వర్, ఎంపీటీసీ నర్సారెడ్డి, ముత్యంరెడ్డి, రమేశ్ పాల్గొన్నారు.



మామడ: కొరిటికల్‌లో పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించిందని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి అన్నారు. సారంగపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 13.50లక్షలతో నిర్మించే సైన్స్‌ల్యాబ్‌కు శంకుస్థాపన చేశారు. అంతకుముందు చించోలి(బి) గ్రామ సమీపంలోని మైనారిటీ గురుకులంలో సీసీరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. డీఈఓ రవీందర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీటీసీ సామల పద్మ, బీజేపీ నాయకులు రాజేందర్‌రెడ్డి, చంద్రప్రకాశ్ గౌడ్, శ్రావణ్‌కుమార్, రాజు, సామల వీరయ్య, సాహెబ్‌రావు, నారాయణ తదితరులు ఉన్నారు.

**లబ్ధిదారులకు చెక్కులు అందజేత**

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో పలు మండలాలకు చెందిన లబ్ధిదారులకు బుధవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇల్లు లేని ప్రతి ఒక్కరికి పీఎం ఆవాస్ యోజన పథకం కింద రూ.ఐదు లక్షలతో ఇంటిని నిర్మించి ఇస్తామని పేర్కొన్నారు. ఆర్డీవో రత్నకల్యాణి, తహసీల్దార్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**భూమిపూజ**

కుభీర్: మండలంలోని ఎస్సీ కాలనీలో పురాతన పాతాళగంగ ఆలయం స్థానంలో నూతన మందిరం నిర్మించేందుకు బుధవారం కాలనీవాసులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాబు, నాయకులు విఠల్, కల్యాణ్, సంతోష్, కరకయ్య, సాయినాథ్ తదితరులు ఉన్నారు.

**నేడు ముగ్గుల పోటీలు**

లక్ష్మణచాంద: మహిళా దినోత్సవం పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏపీఎం వాణిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేశామని.. వివిధ గ్రామాల మహిళలు పాల్గొనాలని సూచించారు.

**ముగిసిన పల్స్ పోలియో**

లక్ష్మణచాంద: మండలవ్యాప్తంగా గత మూడు రోజుల్లో ఐదేళ్లలోపు చిన్నారులు 2800 మందికి పల్స్‌పోలియో చుక్కలు వేసినట్లు బుధవారం పీహెచ్‌సీ వైద్యురాలు ప్రత్యూష తెలిపారు. వైద్యసిబ్బంది శివకృష్ణ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి**

కుంటాల: మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఆప్క గజ్జారాం అన్నారు. గృహజ్యోతి, మహాలక్ష్మి దరఖాస్తుల్లో తప్పులుంటే సరి చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో అబ్దుల్ రహీం, గుద్దేటి నర్సయ్య, చిన్నన్‌రావు, సాయన్న, లతీఫ్, కృష్ణ తదితరులు ఉన్నారు.

**జిల్లాస్థాయి విజ్ఞానమేళాలో ప్రతిభ**

భైంసాటౌన్: బేటీ బచావ్–బేటీ పడావోలో భాగంగా జిల్లా స్త్రీ,శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి విజ్ఞానమేళాలో భైంసాలోని కిసాన్‌గల్లి శ్రీ సరస్వతీ శిశుమందిర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు భోజన్న తెలిపారు. ఎం.శృతి(తొమ్మిదో తరగతి), బి సుకృత(ఏడో తరగతి) ప్రతిభ కనబరిచి జిల్లా అధికారుల చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసాపత్రం అందుకున్నట్లు పేర్కొన్నారు. బుధవారం విద్యార్థులను పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

**విద్యార్థులకు అభినందనలు**

లక్ష్మణచాంద: జిల్లా స్త్రీ,శిశుసంక్షేమశాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్మల్‌లోని ఆశ్రమ పాఠశాలలో మంగళవారం రాత్రి నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. హెల్త్ అండ్ హైజెనిక్ విభాగంలో పార్‌పెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి నాగశివ మూడో స్థానంలో నిలిచాడు. మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎకో సిస్టంపై చేసిన ప్రదర్శన జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి పొందింది. బుధవారం విద్యార్థులను, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

**గంజాల్ విద్యార్థి..**

సోన్: జిల్లా కేంద్రంలో సైన్స్‌ఫేర్‌లో మండలంలోని గంజాల్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థి పి.సంజన (ఆరో తరగతి) జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి పొందినట్లు ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌బాబు తెలిపారు. పనికిరాని వస్తువులతో పర్యావరణ బొమ్మలు, రాళ్లు మట్టి, ఇసుక, పుల్లలు, సీతాఫలం గింజలు, ఆకులతో నెమలి, కోడిపుంజు బొమ్మలను తయారు చేసి ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. సంజనను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

**డీసీసీ అధ్యక్షుడికి సన్మానం**

నిర్మల్‌చైన్‌గేట్: మహాశివరాత్రి జాతర ఉత్సవాన్ని పురస్కరించుకొని కాల్వ ఆలయ చైర్మన్ పుజారం మహేశ్, పాలకమండలి సభ్యులు బుధవారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి స్వామి వారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పూదరి శివ, గుమ్ముల నర్సయ్య, అర్చకులు వెంకటేశ్, జూనియర్ అసిస్టెంట్ మాధవరావు పాల్గొన్నారు.

**ఎస్సైకి సన్మానం**

కడెం: మండలంలోని లక్ష్మీసాగర్ గ్రామస్తులు బదిలీపై లోకేశ్వరం వెళ్తున్న కడెం ఎస్సై కె.రాజును బుధవారం ఘనంగా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ముడికే మల్లేశ్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

**నూతన కార్యవర్గం**

కుంటాల: మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం నెం. 2 కార్యవర్గాన్ని బుధవారం కుంటాలలో ఆ సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పొట్ట జనార్దన్, ఉపాధ్యక్షునిగా చిప్ప గజేందర్, కోశాధికారిగా బోగ ప్రవీణ్, కార్యదర్శిగా చిప్ప సంజీవ్, సభ్యులుగా బోగ గోవర్ధన్, గోడపురం గజేందర్, అండె గంగాధర్, చిప్ప అజయ్‌లు ఎన్నుకోబడ్డారు. వీరిని సంఘ సభ్యులు సన్మానించారు.

### ఇళ్ల నిర్మాణాలకు అనుమతివ్వాలి

పెంబి: ఐటీడీఏ ద్వారా మంజూరైన ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ లక్ష్మణ్‌కు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు వినతిపత్రం అందించారు. శంభు మాట్లాడుతూ మండలంలోని జంగుగూడ పంచాయతీలోని కోలంగూడ గ్రామానికి ఐటీడీఏ ద్వారా పది ఇళ్లు మంజూరు చేయగా పునాదుల వరకు నిర్మించారన్నారు. కానీ అనుమతుల్లేవని అటవీశాఖ అధికారులు పనులు అడ్డుకుంటున్నారని.. అనుమతులు మంజూరు చేయాలని కోరారు. భీంరావు, వసంత్‌రావు, లింబారావు తదితరులు ఉన్నారు.

### ఉపాధి పనుల్లో అలసత్వం వద్దు

దస్తురాబాద్: ఉపాధి పనుల్లో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో కె.రమేశ్ హెచ్చరించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. పని ప్రదేశాన్ని ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలని ఎఫ్‌ఏలకు సూచించారు. నర్సరీలను కార్యదర్శులు సందర్శించి మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. అంతకుముందు ఆకొండపేటలో ఉపాధి పనులు పరిశీలించి కూలీల హాజరు తెలుసుకున్నారు. వారి వెంట ఏపీవో రవిప్రసాద్ తదితరులు ఉన్నారు.

### విజేతలను స్ఫూర్తిగా తీసుకోవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

నిర్మల్‌ఖిల్లా: విద్యార్థులు విజేతలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సా గాలని వశిష్ఠ విద్యాసంస్థల చైర్మన్ వి. సత్యనారాయణగౌడ్ అన్నారు. బుధవారం స్థానిక వశిష్ఠ డిగ్రీ కళా శాలలో వార్షికోత్సవంఅట్ట హాసంగా నిర్వహించారు. కష్టపడి చదివి జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ నీత, ఎస్సై రవి, డాక్టర్ రమణగౌడ్, విద్యాసంస్థల కార్యదర్శి సరోత్తంరెడ్డి, పద్మనాభగౌడ్, ప్రిన్సిపాల్ అఖిలేశ్‌కుమార్ సింగ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ‘ఎల్‌ఆర్‌ఎస్‌లో చార్జీలు వసూలు చేయొద్దు’



రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖానాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే ఎల్ఆర్ఎస్(భూ క్రమబద్ధీకరణ పథకం)లో చార్జీలు వసూలు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు పట్టణంలోని జగన్నాథ్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్ మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక ఎల్ఆర్ఎస్‌ను ఎత్తివేస్తామని చెప్పి... తీరా ఎన్నికల్లో గెలిచాక ఎల్ఆర్ఎస్ పేరిట ప్రజల నుంచి రూ.20వేల కోట్లను దండుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎల్ఆర్ఎస్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రాజగంగన్న, రామునాయక్, మోహిద్, నారాయణరావు, సుమన్, ప్రదీప్, గజేందర్, సరోజ, సుమిత్, మహేందర్, రాజు, నరేందర్, బుచ్చాగౌడ్, వెంకటేశ్వర్‌రావు, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

# బాధ్యతలు స్వీకరించిన నూతన ఎస్సైలు

**సారంగాపూర్ ఎస్సైగా చంద్రమోహన్**



నిర్మల్: సారంగపూర్ మండల నూతన ఎస్సైగా చంద్రమోహన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రూరల్ ఎస్సైగా పని చేసిన చంద్రమోహన్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. నూతన ఎస్సైని ఏఎస్సై వసంత్, సిబ్బంది సత్కరించారు.

**నర్సాపూర్(జి) ఎస్సైగా హన్మాండ్లు**



నర్సాపూర్(జి): మండల నూతన ఎస్సైగా ఎం.హన్మాండ్లు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎస్సై పి.రవీందర్ బదిలీపై కుభీర్ వెళ్లారు. పెంబి మండల ఎస్సైగా పని చేస్తున్న హన్మాండ్లు నర్సాపూర్ (జి)కి వచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

**పెంబి ఎస్సైగా శంకర్**



పెంబి: పెంబి మండల నూతన ఎస్సైగా ఆర్.శంకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నిర్మల్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా పని చేసిన శంకర్ బదిలీపై పెంబి వచ్చారు. ఇక్కడి ఎస్సై హన్మాండ్లు నర్సాపూర్(జి)కి బదిలీ అయ్యారు.

**లోకేశ్వరం ఎస్సైగా రాజు**



లోకేశ్వరం: మండల నూతన ఎస్సైగా రాజు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎస్సైగా పని చేసిన సాయికుమార్ బదిలీపై భైంసా పట్టణ ఎస్సైగా వెళ్లారు. కడెంలో ఎస్సైగా పని చేసిన రాజు బదిలీపై ఇక్కడకు వచ్చారు. అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలను పరిష్కరిస్తానని నూతన ఎస్సై పేర్కొన్నారు.

# మహాగాంలో విగ్రహ ప్రతిష్ఠాపన



మహాగాంలో హాజరైన మహిళలు



దేగాంలో కలశాలతో మహిళలు

భైంసారూరల్: మండలంలోని మహాగాంలో త్రియంబకేశ్వర ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ హోమం, పూజలు చేయగా గ్రామానికే చెందిన పలు జంటలు పాల్గొన్నారు. కలశ పూజలు నిర్వహించి కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, బీజేపీ నాయకులు బోస్లే మోహన్‌రావుపటేల్‌లు ప్రత్యేక పూజలు చేశారు. సమీప ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అంతకుముందు ఉత్సవమూర్తుల శోభాయాత్ర నిర్వహించారు.

**నేడు విగ్రహ ప్రతిష్ఠాపన**

భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామంలో గురువారం దత్తాత్రేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో కలశ పూజలు చేపట్టగా పలు జంటలు సామూహిక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం మహిళలు కలశాలను ఎత్తుకొని ప్రధాన వీధులగుండా ఆలయం వరకు శోభాయాత్రగా వచ్చారు.

# ప్రధాని కార్యక్రమం వీక్షించిన నాయకులు

భైంసాటౌన్: మహిళల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ ముధోల్ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ అన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఎన్‌జీవో సంపర్క్ అభియాన్‌లో భాగంగా బుధవారం పట్టణంలోని గణేశ్‌నగర్ మున్నూరు కాపు సంఘ భవనంలో నారీశక్తివందన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పశ్చిమబెంగాల్‌లో ప్రధాని మోదీ కార్యక్రమాన్ని ఎల్ఈడీ తెరపై మహిళలు, బీజేపీ నాయకులు ప్రత్యక్షప్రసారం ద్వారా వీక్షించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నారాయణరెడ్డి, గోపాల్‌సర్డా, జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, ఎంపీపీ అబ్దుల్ రజాక్, పట్టణ అధ్యక్షులు మల్లేష్ శక్తివందన్ కార్యక్రమ ఇన్‌చార్జి రావుల సువర్ణ, కౌన్సిలర్లు అనిత బాలాజీ సూత్రావే, లక్ష్మి, సుష్మా రెడ్డి పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని జీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ నాయకులు, మహిళలు శక్తివందన్ కార్యక్రమం వీక్షించారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, రవీందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సత్యవతి, ఉపేందర్, దాసరి శ్రీనివాస్, శ్రీధర్, మందపల్లి రమేశ్ తదితరులు ఉన్నారు.

నిర్మల్: సారంగపూర్ రైతువేదికలో శక్తివందన్ అభియాన్‌లో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలు, ఈజీఎస్ సిబ్బంది వర్చువల్‌గా ప్రధాని ప్రసంగాన్ని వీక్షించారు. బీజేపీ మండల అధ్యక్షుడు విలాస్, ఏఓ రాజశేఖర్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ లక్ష్మారెడ్డి, ఐకేపీ సిబ్బంది, మహిళలు, రైతులు ఉన్నారు.

# ముగిసిన ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

కుంటాల: మండలంలోని ఓలా శ్రీ పాండురంగ విఠలేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ముగిశాయి. అర్చకులు శ్రీ జోషి భగవాన్ ఆధ్వర్యంలో స్వస్తి వచనం, రుక్మిణి పాండురంగ ఆరాధన, పంచసూక్త హోమం, మహాహారతి, మంత్రపుష్పం, పూర్ణాహుతి, దేవతా విసర్జనం, ప్రోక్షణ తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పరివార కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో గ్రామస్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, గందె ప్రవీణ్ కుమార్, రాజ్‌కుమార్, శివకుమార్ తదితరులు పూజలు నిర్వహించారు.

# మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లపై మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

దస్తురాబాద్: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని గొడిసీర్యాల రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 8 నుంచి జాతర ప్రారంభం కానుంది. బుధవారం నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి ఆలయ పరిసరాలను పరిశీలించారు. భక్తులకు ఇబ్బంది కల్గకుండా ఏర్పాట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. వాహనాలకు పార్కింగ్, క్యూలైన్‌లో భక్తులను నియంత్రించాలన్నారు. ఖానాపూర్ సీఐ బి.మోహన్, ఎస్సై యాసిర్ అరాఫత్, సిబ్బంది ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ గంగారెడ్డి, సీఐ మోహన్‌ను పెంబి నూతన ఎస్సై శంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు.